సాక్షి చిత్తూరు

సోమవారం । 12 । జూన్ । 2023



సాధనతోనే విజయం సాధ్యం

సాధనతోనే విజయం వరిస్తుందని సాక్షి మీడియా, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ నిర్వహించిన సదస్సులో వక్తలు పేర్కొన్నారు. - 8లో



అలరించిన దుర్యోధన వధ

కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో మహాభారత ఉత్సవాల్లో దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	38	27
తిరుపతి	40	28
తిరుమల	34	23
గూడూరు	42	30
నగరి	41	28

న్యూస్‌రీల్

ముగిసిన వేసవి శిబిరాలు



ధ్రువీకరణపత్రాలు అందుకున్న పిల్లలు

చిత్తూరు కార్పొరేషన్: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు గతనెల 8 నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. చిత్తూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థలో యోగా, స్పోకెన్ ఇంగ్లీషు, నృత్యం, నాటికలు, చిత్రలేఖనం, కథలు చెప్పడం, పద్య పఠనం, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. 25 మంది విద్యార్థులు గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకున్నారు. శిక్షణ ముగిసిన పిల్లలకు మెడల్స్, ధ్రువీకరణపత్రాలను అందజేశారు. గ్రంథాలయాధికారులు లలిత, గజేంద్రబాబు, సుల్తాను బాను, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా టీచర్ల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ల్యాంగ్వేజ్ పండిట్‌లు, పీఈటీలకు ఆదివారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఈవో విజయేంద్రరావు, డీవైఈవోలు చంద్రశేఖర్, కృష్ణప్ప పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 213 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఉన్న ఖాళీలను చూపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌లు రామ్‌కుమార్, సత్య, వీజీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు సమస్యలను వినతుల రూపంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడ వచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

25న న్యాయ ఉద్యోగ సంఘం ఎన్నికలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘం ఎన్నికలు ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు ఆశాఖ ఎన్నికల అధికారులు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, తారకేశ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ పూర్తయ్యిందని పేర్కొన్నారు. చిత్తూరు, తిరుపతి, మదనపల్లె డివిజన్లకు సంబంధించి 531 మంది ఉద్యోగులు ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు.ఈనెల 25వ తేదీన చిత్తూరు పాత కోర్టు ఆవరణలోని న్యాయవాదుల సంఘ కార్యాలయం (బార్)లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. మొత్తం 11 పోస్టులకు 22 మంది ఉద్యోగులు పోటీపడుతుండగా.. అధ్యక్ష పదవికి చిత్తూరుకు చెందిన గోపినాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ బరిలో ఉన్నారు.

కల్లూరును వీడని గజరాజులు

పులిచెర్ల(కల్లూరు): వారం రోజులుగా కల్లూరు పరిసర ప్రాంతల్లోనే ఏనుగులు తిష్ట వేశాయి. రోజూ ఎక్కడో ఒక ప్రాంతంలో పంట పొలాలపై దాడులు చేస్తునే ఉన్నాయి. ఆదివారం చల్లావారిపల్లెలో మామిడి చెట్లతో పాటు టమాట పంటపై విరుచుకుపడి విధ్వంసం సృష్టించాయి. రెండు గానుగ క్రషర్లను కూడా ధ్వంసం చేశాయి. కల్లూరు అటవీ సమీప ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు శనివారం రాత్రి ఏనుగులు పంటలపైకి రాకుండా బాణసంచా సైతం పేల్చారు.

తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి

చిత్తూరు కలెక్టరేట్:ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పలువురు డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏ శ్రీనివాసులు సత్యసాయి జిల్లాకి, కే.అమర్‌నాథ్ తిరుపతికి, శివరామసుబ్బయ్యను వైఎస్‌ఆర్ జిల్లా నుంచి తిరుపతికి, జనార్దనమ్ చిత్తూరు నుంచి తిరుపతికి, నరసింహులు చిత్తూరుకు, కృష్ణను చిత్తూరు నుంచి తిరుపతికి, ఝాన్సిలక్ష్మిని చిత్తూరుకు, జయప్రకాష్‌ను చిత్తూరుకు, హమీద్‌బాషాను చిత్తూరు నుంచి సత్యసాయి జిల్లాకు కేటాయించారు. అలాగే భగవతిని చిత్తూరుకు, మురళీమోహన్‌ను చిత్తూరుకు, శేషగిరి రావును చిత్తూరు నుంచి తిరుపతి జిల్లాకు కేటాయించారు. కుమారస్వామిని చిత్తూరుకు,గుణశేఖర్‌రెడ్డిని చిత్తూరుకు, మురాషావలిని చిత్తూరు నుంచి సత్యసాయి, జనార్దన్‌రాజును వైఎస్‌ఆర్ కడప జిల్లా నుంచి తిరుపతికి, లక్ష్మీనారాయణను చిత్తూరుకు, రవికుమార్‌ను చిత్తూరు జిల్లాకు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు.

నాడు: గతంలో నూతన విద్యాసంవత్సరంలో పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలికేవి. తరగతి గదుల కొరత, సబ్జెక్టు టీచర్లు లేకపోవడం, మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు తదితర సమస్యలు ఉండేవి. టీడీపీ పాలనలో సర్కారు బడులను అభివృద్ధి చేయకపోవడంతో తల్లిదండ్రులు గత్యంతరం లేక ప్రైవేట్ బడులకు పిల్లలను పంపేవారు. పుస్తకాలు, షూలు, బ్యాగులు, దుస్తుల కొనుగోలుకు సామాన్యులు అప్పులు చేసేవారు.

నేడు: ప్రస్తుతం ట్రెండ్ మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్కారు బడులు సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద రూ. వేలాది కోట్లతో కార్పొరేట్‌ను తలదన్నేలా సర్కారు బడులను తయారు చేసింది. అమ్మఒడితో పాటు పాఠశాలల పునఃప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక కింద 9 రకాల కిట్లను అందజేస్తుండడంతో తల్లిదండ్రులు సంతోషంగా తమ పిల్లలను సర్కారు బడులకు పంపుతున్నారు.



బడిగంట



చిత్తూరు పీసీఆర్ పాఠశాలలో దెస్కులను శుభ్రం చేస్తున్న సిబ్బంది

బడికి వేళాయె..

ఆటపాటలతో వేసవి సెలవుల్లో ఉత్సాహంగా గడిపిన విద్యార్థులు సోమవారం నుంచి బడిమెట్లు ఎక్కనున్నారు. 2022–23 విద్యాసంవత్సరం జూన్ 11తో ముగిసింది. 2023–24 విద్యా సంవత్సరం నేటి నుంచి ప్రారంభం కానుంది. వేసవి సెలవుల్లో ఇప్పటి వరకు ఇంటిపట్టునే ఉన్న విద్యార్థులు..పుస్తకాల బ్యాగులతో నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. బడులు పున:ప్రారంభం అవుతున్న సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

- నేటి నుంచి పాఠశాలల పున: ప్రారంభం
- ఏర్పాట్లు సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు
- నేడు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ
- వేసవి దృష్ట్యా ఈనెల 17 వరకు ఒంటి పూటబడులు

చిత్తూరు కలెక్టరేట్ : వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. కొత్త ఆశలు, సరికొత్త ఆలోచనలతో నూతన విద్యా సంవత్సరంలోకి విద్యార్థులు అడుగుపెట్టనున్నారు. అందంగా ముస్తాబైన పాఠశాలలు పిల్లలకు స్వాగతం పలకనున్నాయి. జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో 2,902 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2,39,201 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ఈ విద్యాసంవత్సరం బడులకు రానుండగా, కొత్త అడ్మిషన్‌లు సైతం కానున్నాయి. విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. పాఠశాలల ప్రాంగణాల్లో చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టారు. నాడు–నేడు పనులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని డీఈవో క్షేత్రస్థాయి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

తొలిరోజే జగనన్న విద్యాకానుక కిట్లు

జిల్లా వ్యాప్తంగా అన్ని సర్కారు బడుల్లో జగనన్న విద్యాకానుక కిట్లను తొలిరోజే పంపిణీ చేయనున్నారు. ఆయా పాఠశాలల స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం విద్యార్థులకు అందించనున్నారు. ఆ కిట్లల్లోనే పాఠ్యపుస్తకాలతో పాటు, విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని ప్రభుత్వం అందజేయనుంది. జిల్లాలో విద్యార్థులకు తొలిరోజే కిట్లను అందజేయనున్నారు.

జిల్లా సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	1,918
విద్యార్థుల సంఖ్య	63,311
ప్రాథమికోన్నత పాఠశాలలు	208
చదువుతున్న విద్యార్థులు	15,232
ఉన్నత పాఠశాలలు	352
చదువుతున్న విద్యార్థులు	85,358
మొత్తం పాఠశాలలు	2.478
మొత్తం విద్యార్థులు	1,63,901





జేవీకే కిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్



పంపిణీ చేయనున్న జగనన్న విద్యాకానుక కిట్లు

మధ్యాహ్నం తరగతులు నిర్వహిస్తే చర్యలు

అధికంగా ఎండలు ఉండడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒంటి పూట బడులకు అనుమతిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు ఈనెల 12 నుంచి ఈ నెల 17 వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని, ప్రైవేట్ యాజమాన్యాలు సైతం నిబంధనలను పాటించాలని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ మధ్యాహ్నం తరగతులు నిర్వహిస్తే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకే బడులు నిర్వహించాలని ఆదేశించారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు



సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం మౌలిక వసతులను కల్పించింది. విద్యార్థులకు జేవీకే కిట్లను మొదటి రోజే అందజేయనున్నారు. పకడ్బందీగా నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా పొరబాట్లు జరిగితే చర్యలు తప్పవు. ప్రతి విద్యార్థికి కిట్లు అందాలి.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

అన్ని ఏర్పాట్లు సిద్ధం



2023–24 విద్యా సంవత్సరం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. వందశాతం ఎన్‌రోల్‌మెంట్ లక్ష్యంగా సర్కారు బడుల్లో నాణ్యమైన గుణాత్మక విద్య అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఉపాధ్యాయులు సకాలంలో విధులకు వెళ్లి జేవీకే కార్యక్రమంలో పాల్గొనాలి. పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి కార్యక్రమం ఘనంగా నిర్వహించాలి.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

బడులకు కొత్త అయ్యోర్లు

టీచర్ల కోరిక మేరకు ప్రభుత్వం వేసవి సెలవుల్లో బదిలీలను నిర్వహించింది. ఆ ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. కచ్చితంగా బదిలీ కావాల్సిన వారు 4072 మంది, రిక్వెస్ట్ బదిలీలకు 4,904 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ విద్యాశాఖ ఆన్‌లైన్‌లో బదిలీ ఉత్తర్వులు పంపింది. వాటిని స్వీకరించిన అయ్యోర్లు బదిలీ అయిన పాఠశాలల్లో చేరారు. నూతన విద్యాసంవత్సరంలో పలు సర్కారు బడుల్లో కొత్త అయ్యోర్లు పాఠాలు బోధించనున్నారు.

ప్రాణాలు తీసిన షార్ట్‌కట్

- అంజేరమ్మ కనుమ వద్ద ఘోర ప్రమాదం
- టెంపోను ఢీకొట్టిన పాల వ్యాను
- ఐదుగురి మృతి
- ఎనిమిది మందికి గాయాలు



వాహనంలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీస్తున్న 108 సిబ్బంది, స్థానికులు

వడమాలపేట: రియల్ ఎస్టేట్ యజమాని ఆహ్వానం.. ఎక్కడెక్కడో ఉన్న ఉద్యోగులందరూ కలిసి ఒక్కటిగా ప్రయాణం.. మదిలో అమ్మవారి దర్శనం .. ఆపై విందు భోజనం.. ఇలా ఎన్నో ఊహలు, ఊసులతో సాగిన ప్రయాణం ఆ కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. గుడికి త్వరగా వెళ్లేందుకు టెంపో డ్రైవర్ షార్ట్‌కట్‌ను వెదకడం.. ఆపై రాంగ్ రూట్‌లో వెళ్లడం.. ఎదురుగా వస్తున్న పాల ట్యాంకర్ ఢీకొట్టడం క్షణాల్లో జరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా.. మరో ఎనిమిది మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు.

అసలేం జరిగిందంటే

తిరుపతి ఎస్‌ఆర్ ఇండియా ప్రైమ్ ప్రాపర్టీస్ నిర్వాహకులు వడమాలపేట మండలం, ఎస్వీపురం పంచాయతీలోని అంజేరమ్మకు పొంగళ్లుపెట్టి మొక్కులు చెల్లించాలని భావించారు. బంధుమిత్రులు, సిబ్బందిని విందు భోజనానికి ఆహ్వానించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 13 మందితో ఆదివారం మధ్యాహ్నం టెంపోలో బయలుదేరి, ఎస్వీపురం టోల్ ప్లాజా దాటారు. తర్వాత అంజేరమ్మ ఆలయానికి త్వరగా వెళ్లడానికి టెంపో డ్రైవర్ షార్ట్‌కట్‌లో ఉన్న రాంగ్‌రూట్‌ను ఎంచుకున్నాడు. కొంత దూరం వెళ్లాక ఎదురుగా వస్తున్న మిల్క్ వ్యాన్ ఢీకొట్టడంతో టెంపోలో ప్రయాణిస్తున్న రేవంత్(44), గిరిజ (45), శివకుమార్ (57), రేఖ(24), అజయ్‌కుమార్ అలియాస్ అంజి(25) మృతిచెందారు.

యమడేంజర్

అంజేరమ్మ కనుమ ప్రమాదకరమైంది. ఇక్కడ గుట్టపై వెలసిన అంజేరమ్మ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తుంటారు. ఆది, మంగళ, శుక్రవారాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. జంతుబలులిచ్చి, పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తుంటారు. ఈనేపథ్యంలో కొత్తగా వచ్చేవారు ఎలా వెళ్లాలో తెలియక తికమక పడుతుంటారు. కొందరు రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రమాదాల బారిన పడుతుంటారు. రద్దీగా ఉండే ఈ మార్గంలో ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు కూడా లేవు. హైవే అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయని స్థానికులు చెబుతున్నారు.





గాయపడిన నరసింహులు, ఆంజనేయులు

ఈ ఏడాదిలోనే 8 మంది మృతి

ఈ ఏడాదిలోనే అంజేరమ్మ కనుమ వద్ద 8 మంది మృతిచెందారు. 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. 2023 ఫిబ్రవరిలో స్కూటర్‌పై వెళ్తున్న చెన్నైకి చెందిన ఇద్దరు యువ లాయర్లు దుర్మరణం పాలయ్యారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇటీవల రెండు స్కూటర్లు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. ముగ్గురు గాయపడ్డారు. తాజాగా ఆదివారం జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా.. మరో ఎనిమిమందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

పరిసరాల శుభ్రతపై అవగాహన



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజశేఖర్‌రెడ్డి

పుంగనూరు: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. పట్టణ సమీపంలోని నక్కబండలో జ్వర బాధితులు ఉన్నారన్న వార్తలు రావడంతో డీఎంఅడ్‌హెచ్‌వో ఆదివారం ఆ ప్రాంతంలో పర్యటించారు. రెండు రోజుల కిందట నక్కబండకు చెందిన శ్రీనివాసులు, జయమ్మ కుమా రుడు గణేష్(11) అనారోగ్యం భారీన పడి మృతి చెందాడు. దీనిపై బాధిత కుటుంబం వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రజలందరు అప్రమత్తమై పరిసరాల మధ్య చెత్త, నీటి నిల్వలు లేకుండ జాగ్రత్తలు వహించాలని తెలిపారు. పట్టణంలోని మురికివాడల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిలర్ మనోహర్, వైద్య విస్తరణాధికారి మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

సిఫార్స్ దర్శనాల అక్రమాలకు చెక్

ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న స్వయంభు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తీసుకుంటున్న ప్రక్షాళనా చర్యలతో సామాన్య భక్తులు సులభంగా దర్శనం చేసుకుంటున్నారు. వీఐపీల పేరుతో అక్రమ దర్శనాలు, సెల్‌ఫోన్లతో ప్రవేశంపై దేవస్థానం తీవ్రంగా స్పందించింది. సెల్‌ఫోన్లతో ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించింది. ఉభయదారులు, ప్రొటోకాల్‌లో వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు మినహా మిగిలిన వారంతా టికెట్లు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవడంతో అక్రమాలకు చెక్‌పడింది.

- సామాన్య భక్తులకే పెద్దపీట
- సెల్‌ఫోన్లు బయటపెట్టి వెళ్లాల్సిందే
- అందరు టికెట్లు కొనుగోలు చేయాల్సిందే
- ఉభయదారులకు, ప్రొటోకాల్‌కు మినహాయింపు

కాణిపాకం(యాదమరి) : కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ప్రశాంత దర్శనం కల్పించేందుకు దేవస్థానం అధికారులు, పాలకమండలి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. స్వామివారి దర్శనంలో సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి కాకుండా దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. నిత్యం స్వామిని 15 వేలు నుంచి 20 వేలకు పైగా భక్తులు దర్శించుకుంటున్నారు. శుక్ర, శని, ఆది వారాల్లో 20 వేల మందికి పైగా భక్తులు పోటెత్తున్నారు. ఇదే సమయంలో కొంత మంది అధికారులు, వీఐపీలు, స్థానిక ప్రముఖల పేర్లతో వీఐపీ ద్వారం నుంచి ప్రత్యేక దర్శనాలు చేయించేవారు. సెల్‌ఫోన్లతో లోపలున్న తమవారితో సిఫార్సులు చేసేవారు. గర్భాలయంలో ప్రత్యేక దర్శనానికి వచ్చిన వారు పెద్ద సంఖ్యలో గుమికూడడంతో సామాన్య భక్తులు ఇబ్బందులకు గురయ్యేవారు. స్వామివారు సరిగ్గా కనడపక, హారతులు అందక సామన్య భక్తులు అసంతృప్తితో వెనుదిరిగేవారు. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో ఉభయదారులు, ప్రొటోకాల్‌లో వచ్చే అధికారులకు, ప్రజాప్రతినిధులకు మినహాయించి సిఫార్స్ దర్శనాలను, సెల్‌ఫోన్లతో ప్రవేశాన్ని రద్దు చేసింది. సెల్‌ఫోన్ల కోసం ఆలయం వెలుపల కౌంటర్లను ఏర్పాటు చేసింది. ప్రవేశ ద్వారాల వద్ద తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్నారు.

గణనాథునికి దర్శనానికి 5గంటలు

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మూడు రోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతుండడంతో స్వామివారి దర్శనానికి 5 గంటల సమయం పట్టింది. కంపార్ట్‌మెంట్లు, రూ.150, రూ.100 క్యూలు, ఉచిత క్యూలు నిండిపోయి ఆలయం వెలుపలి వరకు భక్తులు బారులు తీరారు. భక్తులకు తాగునీరు, మజ్జిగను దేవస్థానం అందించింది. భక్తులు త్వరితగతిన దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకుంది.



వీఐపీ గేట్ వద్ద వేచి ఉన్న భక్తులు

అవసరమైన వారికే సిఫార్స్ దర్శనం



ఆలయ అభివృద్ధికి అందరు సహకరించాలి. వేసవిలో భక్తులు రద్దీ దృష్ట్యా సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. సిఫార్స్ దర్శనాలు అవసరమైన వారికే కల్పిస్తున్నాం . ఆలయ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నాం. అందరూ సహకరించాలి.

– మోహన్ రెడ్డి, దేవస్థానం చైర్మన్

సెల్‌ఫోన్లు కౌంటర్‌లో పెట్టాల్సిందే



ఆలయంలో సెల్‌ఫోన్‌తో ప్రవేశాన్ని నిషేధించాం. ఎవరైనా ఆలయం బయట కౌంటర్ పెట్టి రావాల్సిందే. సామాన్య భక్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో సిఫార్స్ దర్శనాలను కుదించాం. ఉభయదారులు, ప్రోటోకాల్‌లో వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధుల మినహా మిగిలిన వారు టికెట్ కొనుగోలు చేయాల్సిందే.

– వెంకటేశు, ఆలయ ఈఓ


బోయకొండలో వాహనపూజ పునః ప్రారంభం



పూజా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ దేవస్థానం వద్ద వాహన పూజను ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పునః ప్రారంభించారు. రెండేళ్ల కిందట కోవిడ్ సమయంలో వాహన పూజలను దేవస్థానం అధికారులు నిలిపివేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు వాహన పూజ పునఃప్రారంభానికి చర్యలు చేపట్టారు. రూ.100 చెల్లిస్తే ఆలయ అర్చకులు వాహనానికి పూజ చేస్తారు. వాహన పూజా కార్యక్రమానికే ఇద్దరు అర్చకులు, ఇద్దరు సహాయక సిబ్బందిని నియమిస్తామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. అనంతరం అమ్మవారిని పెద్దిరెడ్డి దర్శించుకొన్నారు. హోమశాల నిర్మాణ పనులు పరిశీలించారు. కాగా ఆదివారం ఆలయం భక్తులతో పోటెత్తింది.

మేఘమై నేను వచ్చాను!



ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆకాశం మేఘావృతమైంది. నైరుతీ రాకతో కారు మబ్బులతో నిండిపోయింది. భానుడి కిరణాల మాటున వెండి మబ్బుల్లా కనువిందు చేయడం.. ఆ సుందర దృశ్యాలు పలువురు సెల్‌ఫోన్లలో బంధించడం కనిపించింది. ఇన్నాళ్లూ ఉక్కపోత, ఎండ వేడిమితో అల్లాడిన జనానికి కాస్త ఉపశమనం కలిగినట్లయింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

సాధనతోనే విజయం సాధ్యం



సదస్సులో మాట్లాడుతున్న అధ్యాపకుడు కృష్ణారెడ్డి



విజేతలకు నగదు, స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అతిథులు

- సృజనాత్మకత.. అభ్యసనతో పోటీ పరీక్షల్లో రాణింపు
- అభ్యర్థులు ఆర్‌సీ ఎగ్జామ్స్ వంటి ఉత్తమ కోచింగ్ సెంటర్లు ఎంచుకోవాలి
- అవగాహన సదస్సులో వక్తలు

తిరుపతి కల్చరల్ : సాధనతోనే పోటీ పరీక్షల్లో విజయం సాధ్యమని, ఇందులో రాణించాలంటే సృజనాత్మకత.. అభ్యసన అవసరమని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. సాక్షి మీడియా గ్రూపు, హైదరాబాద్ ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో గ్రూప్–2 పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం త్వరలో గ్రూప్ –2 ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థుల్లో పోటీ పరీక్షలకు తగ్గట్లు నైపుణ్యాలను పెంపొందించేందుకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు నిపుణులైన అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్‌కరీం (హిస్టరీ), బి.కృష్ణారెడ్డి (పాలిటీ), ఎండీ పాషా (ఎకనామీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ) హాజరై అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. గ్రూప్–1 అధికారులు వెంకటనారాయణ, శ్యామ్ సుందర్, సుధాకర్ తమ అనుభవాలను వివరించి అభ్యర్థుల్లో స్ఫూర్తి నింపారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన లెజండరీ ఫ్యాకల్టీతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ విధానంలో వేల మంది అభ్యర్థులు తమ వద్ద శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు మాట్లాడుతూ పోటీ పరీక్షల అభ్యర్థులకు సాక్షి భవిత, సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ద్వారా అద్భుతమైన మెటీరియల్ అందిస్తున్నామన్నారు. అభ్యర్థులు ఇలాంటి అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాక్షి జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్ తిరుమల రవిరెడ్డి మాట్లాడుతూ లక్ష్యంతో ముందుకెళుతూ ప్రణాళికబద్ధంగా సాధన చేస్తే విజయం సాధించవచ్చని తెలిపారు. ప్రస్తుత పోటీ పరీక్షల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులను సైతం ఉన్నత శిఖరాలు అధిరోహించి ఉజ్వల భవితకు మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా గ్రూప్–2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించినట్లు వెల్లడించారు. అనంతరం అభ్యర్థులకు నమూనా టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, స్టడీ మెటీరియల్ అందించారు. తర్వాత స్థానాల్లో నిలిచిన 20 మందికి ప్రామాణిక స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో సాక్షి టీవీ కరస్పాండెంట్ విజయమూర్తి, ఈవెంట్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


హాజరైన అభ్యర్థులు

అత్యుత్తమంగా గ్రూప్-2 శిక్షణ అందిస్తున్నాం



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో రాష్ట్రంలోనే అత్యుత్తమ శిక్షణను ఆర్.సీ.ఎగ్జామ్ సంస్థ ద్వారా అందిస్తున్నాం. రాష్ట్రంలోని అత్యుత్తమ ఫ్యాకల్టీలందరూ మా సంస్థలో బోధన చేస్తున్నారు. వారి సహకారంతో ఈనెల 19 నుంచి ఏపీ గ్రూప్–2 బ్యాచ్‌కు అడ్మిషన్లు ప్రారంభించనున్నాం. హైదరాబాద్ రాలేని ప్రైవేటు ఉద్యోగులు, గృహిణులు, ఇతర విద్యార్థుల కోసం ఎగ్జామ్స్ మొబైల్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లిషు మీడియంలలో శిక్షణ అందిస్తాం. పూర్తి వివరాల కోసం 89850 93399, 89850 94499 నంబర్లను సంప్రదించ వచ్చు.

-మొండెం కిరణ్‌కుమార్, చైర్మన్ ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ, హైదరాబాద్

స్ఫూర్తిని కలిగించారు



అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో స్ఫూర్తిని కలిగించారు. ప్రణాళిక బద్ధమైన సాధన విజయాన్ని సాధిస్తుందని ఉదాహరణలతో చెప్పిన తీరు అద్భుతం. గ్రూప్స్‌నకు సన్నద్ధమవుతున్న నాలాంటి అభ్యర్థులకు ఈ అవగాహన సదస్సు ఒక వరం.

- కె. ఉమ దుశ్యంత్, తిరుపతి

సాధనకు దిక్సూచి



ఉన్నత కొలువులు సాధించాలని సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఇలాంటి అవగాహన సదస్సు ఒక దిక్సూచిలా ఉపకరిస్తుంది. ఇందుకు కృషి చేసిన సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేసి నిరుద్యోగుల అభ్యున్నతికి దోహదపడాలి.

- ఎం.నీరజ. అభ్యర్థి

ఆత్మవిశ్వాసం పెంచింది



గ్రూప్–2 పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే అభ్యర్థులు తీసుకోవాల్సిన అంశాలపై నిపుణులైన ఫ్యాకల్టీ అందించిన చక్కటి మార్గనిర్దేశం ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. పోటీ పరీక్షలకు తొలిసారిగా పోటీ పడే అభ్యర్థులు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చు అనే విష యాలను అర్థమయ్యేలా చక్కగా వివరించారు.

- టి.శరత్. అభ్యర్థి, కదిరి

సాక్షికి కృతజ్ఞతలు



గ్రూప్–2 ఉద్యోగం సాధించాలంటే ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో ఈ అవగాహన సదస్సు ద్వారా అవగతమైంది. ఏయే సబ్జెక్టులపై ఎలా ఫోకస్ చేయాలనే అంశాలపై స్పష్టత వచ్చింది. ప్రిలిమినరీ, మెయిన్స్ రెండింటికి ఒకే దఫా ఎలా సన్నద్ధం కావాలనే అంశంపై అంచనా ఏర్పడింది. ఇలాంటి సదస్సు నిర్వహించిన సాక్షి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు

- బి.చంద్రనాయక్ అభ్యర్థి

ఉన్నతంగా ప్రిపరేషన్



పోటీపరీక్షలకు ప్రశ్నపత్రం కంటే మన ప్రిపరేషన్ ఉన్నతంగా ఉండాలి. పరీక్షల స్టాండర్డ్ ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో కఠోర శిక్షణ తప్పనిసరి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ లభిస్తున్నప్పటికీ ఆన్‌లైన్‌లో పొందే శిక్షణ ద్వారా పోటీతత్వం అవగతమవుతుంది. పోటీ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పక్కవారికంటే ఒక్క మార్కు ఎక్కువ సాధించేలా శ్రమించాలి. ఎప్పటికప్పుడు సబ్జెక్ట్‌ల్లో అప్‌డేట్ కావాలి. నిష్ణాతులైన ఆర్‌సీ ఎగ్జామ్స్ సెంటర్‌లో లెజెండరీ ఫ్యాకల్టీ అందుబాటులో ఉంటారు.

- డాక్టర్ అబ్దుల్ కరీం, హిస్టరీ ఫ్యాకల్టీ

సిలబస్ పూర్తి చేయాలి



పోటీ ప్రపంచంలో సమయం ఎంతో విలువైంది. నోటిఫికేషన్ జారీ చేసే లోపు సిలబస్‌ను పూర్తి చేయడం ద్వారా ప్రిపరేషన్‌లో ముందుండవచ్చు. పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ అభ్యర్థులు పెట్టుబడి పెట్టేది కేవలం విలువైన సమయం మాత్రమే. ఎకానమీ సబ్జెక్టు అభ్యర్థుల విజయాన్ని డిసైడ్ చేస్తుంది. సరైన ప్రణాళిక విజయానికి బాటలు వేస్తుంది. ఉద్యోగం సాధించిన తర్వాత వచ్చే హోదా, గుర్తింపు మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి.

- ఎండీ పాషా, ఎకానమీ ఫ్యాకల్టీ

గైడెన్స్‌దే ప్రధాన పాత్ర



అభ్యర్థులు విజయం సాధించేందుకు గైడెన్స్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇతరుల అనుభవాలను తీసుకోవడం ద్వారా విజయం సాధించవచ్చు. గైడెన్స్ గెట్‌విన్. విజేతలతో పాటు పరాజితుల ఇంటర్వ్యూలను ఆదర్శంగా తీసుకోవాలి. ఏమి చేయాలో ... ఏమి చేయకూడదో తెలుసుకుంటే గెలుపు మనదే. ఎక్కువ సార్లు సాధన చేయడమే విజయ రహస్యం. సంక్షిప్తత నుంచి సరళత్వం దిశగా సాధన ఉండాలి. నాణ్యమైన కంటెంట్, సిలబస్‌ను లోతుగా చదవాలి.

- పి.హరికృష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

ఆలోచనే విజయానికి సోపానం



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రతి అక్షరాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకోవాలి. ప్రశ్నలు ఎలా వస్తాయో ఊహించేలా సబ్జెక్టుపై పట్టు సాధించాలి. ఇందుకు తగ్గ విజయ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. వైవిధ్యంగా ఆలోచించడం, సృజనాత్మకతను జోడించడం ద్వారా విజయం సాధ్యమవుతుంది. సబ్జెక్టుపై అవగాహన పొందడం ద్వారా సమగ్రత వస్తుంది. విజయంతో విశ్వాసం పెరుగుతుంది. పాలిటీలో గ్రాఫ్స్, విస్మృతి, అనువర్తిత విషయాలపై దృష్టి సారించాలి.

- బి.కృష్ణారెడ్డి, పాలిటీ ఫ్యాకల్టీ

నలుగురు సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ ఆదివారం పోలీసుశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కల్లూరు సీఐ ఆశీర్వాదం వి.కోటకు బదిలీ అయ్యారు. అనంతపురం త్రీటౌన్ సీఐ కట్టి శ్రీనివాసులును కల్లూరుకు, వి.కోట సీఐ ప్రసాద్ బాబును చిత్తూరు వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న నాగరాజరావ్‌ను బంగారుపాళ్యంకు, ఇక్కడ పనిచేస్తున్న నరసింహారెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు.



2014లోనే టీడీపీ కంచుకోట కూలింది

- మాజీ మంత్రి అమర్ ఓడినా పచ్చనేతలకు అర్థం కాలేదా?
- వైఎస్సార్ సీపీలోనే సంక్షేమం
- స్పష్టం చేసిన అయ్యంరెడ్డిపల్లెవాసులు


మాట్లాడుతున్న అయ్యంరెడ్డిపల్లె వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు

పలమనేరు: తమ గ్రామం టీడీపీ కంచుకోటగా ఉంటూ 2014లో కూలిపోయిందని, ప్రస్తుతం ఇక్కడ వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని పలమనేరు మండలం కొలమాసనపల్లె పంచాయతీ అయ్యంరెడ్డిపల్లె గ్రామస్తులు స్పష్టం చేశారు. తమ గ్రామం ఇప్పటికీ టీడీపీకి కంచుకోట అని ఆ గ్రామానికి చెందిన కొందరు ఆపార్టీ నేతలు చెప్పండంపై గ్రామస్తులు తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం కొలమాసనపల్లెలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అంతకు ముందు గొల్లపల్లె నుంచి కొలమాసనపల్లె వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రస్తుతం టీడీపీలో మాజీ మంత్రిగా ఉన్న అమరనాథ్‌రెడ్డి 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా టీడీపీ అభ్యర్థి సుభాష్‌చంద్రబోస్‌పై గెలిచారని, అప్పుడు తమ గ్రామంలో వైఎస్సార్‌సీపీకి మెజారిటీ వచ్చిందన్నారు. 2019 ఎన్నికల్లో ఇదే అమరనాథరెడ్డి పార్టీ ఫిరాయించి టీడీపీ అభ్యర్థిగా నిలబడినప్పుడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఓసామాన్యుడు వెంకటేగౌడ 33 వేల మెజారిటీతో ద్విగ్విజయం సాధించారన్నారు. ఈ ఎన్నికల్లో ఇంత మెజారిటీ వచ్చిందంటే తమ గ్రామంలో మెజారిటీ వైఎస్సార్‌సీపీకేనని టీడీపీ నాయకులు అర్థం కాలేదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రిగా అమరనాథరెడ్డి కొంతమేర అభివృద్ధి చేసుండచ్చోగానీ, నేటి ప్రభుత్వంలో మాదిరి అభివృద్ధిగానీ, సంక్షేమ పథకాలు గానీ ఎన్నడూ లేదన్నారు. అందుకే తమ గ్రామస్తులు వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరులుగా ఉంటూ ఎమ్మెల్యే వెంకటేగౌడకు మద్దతుగా నిలుస్తున్నామని తెలిపారు. టీడీపీ వారే ఎమ్మెల్యే వద్దకెళ్లి సంతోషంగా పార్టీలో చేరి, మళ్లీ బెదిరించి కండువాలు వేశారనడం సిగ్గుచేటన్నారు. వాళ్లకు ఇష్టంగా ఉంటే టీడీపీలో కొనసాగవచ్చని, ఊరంతా టీడీపీనేనని చెప్పడం తగదన్నారు. తాము ఎన్నటికీ బానిసలు కామనే విషయాన్ని వారు గుర్తించుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవిందుస్వామి, మనోజ్‌రెడ్డి, ఉప సర్పంచ్ నరసింహారెడ్డి, అమరనాథ రెడ్డి, ఎంపీటీసీ మేనకశ్రీనివాసులు, వీరభద్ర, ధనుంజయ, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గం


బాలాజీ (జిల్లా అధ్యక్షుడు)

చిత్తూరు రూరల్: రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ హెచ్ఐవీ ల్యాబ్ టెక్నీషియన్స్ అండ్ పారామెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం చిత్తూరు నగరంలోని ఆ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా బాలాజీ, కార్యదర్శిగా నగేంద్ర, కోశాధికారిగా మోహన్ మురళిని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ విలీనంపై అధికారులతో చర్చిస్తామని తెలిపారు.

అలరించిన దుర్యోధన వధ


అగ్నిగుండం వద్ద పూజలు

కార్వేటినగరం: మండలంలోని కొల్లాగుంటలో శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి సీతాలక్ష్మి హరికథా గానంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ఆలపించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణార్జున నాట్య కళా మండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుడిని గంగ మడుగు నుంచి భీమసేనుడు వెలికి రప్పించే ఘట్టం విశేషంగా ఆకట్టుకుంది. దుర్యోధన వేషధారి ఆలపించిన పద్యాలు, హావభావాలు కంటతడి పెట్టించాయి. మధ్యాహ్నం వెయ్యిమందికి అన్నదానం చేశారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బాణ సంచా వేడుకలను భక్తజనం ఆసక్తిగా తిలకించారు.చుట్టుపక్కల గ్రామాల నుంచి విచ్చేసిన జనంతో గ్రామంలో సందడి నెలకొంది.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

- రూ.10 లక్షల పరిహారం
- మంత్రి పెద్దిరెడ్డి ప్రగాఢ సానుభూతి


మృతి చెందిన షేక్ ఆసిఫ్ (ఫైల్)

పుంగనూరు: పట్టణంలోని నక్కబండ ప్రాంతానికి చెందిన షేక్ ఆసిఫ్ (24) శనివారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. సబ్‌స్టేషన్ సమీపంలో గూడురుపల్లె వద్ద లైన్లు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురైయ్యాడు. వెంటనే ఆప్రాంత వాసులు అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ విషయమై బాధితుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేయడంతో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మైనారిటీ నా యకుడు అస్లాంమురాది కలసి సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. ప్రమాదానికి కారణం తెలుసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి పెద్దిరెడ్డి పరామర్శ

సమాచారం అందిన వెంటనే మంత్రి పెద్దిరెడ్డి విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడారు. బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. అండగా ఉంటామని, అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు. మంత్రి ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ వారు రూ.5 లక్షల పరిహారం అందజేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక విద్యుత్ అధికారులు కూడా తమ వంతు సహాయంగా మృతుడి కుటుంబానికి మరో రూ.5 లక్షలు ఇస్తామని తెలిపారు.